# పరమ పురుషుని ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదము

**సకల వేదాంత గ్రంథాల సారమెల్ల**
**ఒక్క వాక్యాన చెప్పుదునొక్కసారి**
**సర్వజీవులయందున్న ఆత్మ నేనను**
**ఒక్కటేయని మనమున యెంచరయ్య**

దివ్యాత్మ స్వరూపులారా!

మంత్ర ద్రష్టలైన మహర్షులచే ఆవిష్కరింపబడిన సత్యవాక్యసమూహమే వేదము. భూతభవిష్యత్ వర్తమానములందు తిరుగులేని సత్యాన్ని ఆవిష్కరింపజేసినదే వేదము. త్రిలోకములకు యోగక్షేమమునందించి సమాజములో అవసరమైన విజ్ఞానము, శాంతిని నెలకొల్పునదే వేదము. పరమ పురుషుని ఉచ్ఛ్వాసనిశ్వాసములే వేదము. ఇది 'విత్' అనే ధాతువునుండి వుద్భవించినది. 'విత్' అనగా జ్ఞానము. జ్ఞానమయమైనదే వేదము. అనంతమైనది వేదము, 'అనంతో వై వేదాః' అని. జ్ఞానముకూడను అనంతమైనది.

**వేద విభాగములు**

ఇట్టి అనంతమైన వేదమును సామాన్యమానవులు అధ్యయనము చేసి దానిని పూర్తిగా అభ్యసించటము కష్టతరమైన విషయము. ఇంత పెద్ద వేదమును అధ్యయనము చేయటకు కాలముకూడను అధికముగా పడుతుంది. అందువలన సామాన్యమైన మానవుడు వేదాధ్యయనము చేయుటకు యేమాత్రము పూనుకొనడు. ఇట్టి సత్యాన్ని గుర్తించిన వ్యాసమహర్షి యీ వేదమును నాలుగు భాగములుగా విభజించి, ఋక్కులన్నియు వేరు చేసి 'ఋక్ సంహిత' అని పేరు పెట్టాడు. ఈ అనంతమైన వేదమునుండి 'యజుస్సు'నంతా వేరుజేసి 'యజు స్సంహిత' అని పేరు పెట్టాడు. సామమునంతా వేరుచేసి దీనికి 'సామ

sri sathyasai vahinamrutam

సంహిత' అని పేరు పెట్టాడు. అధర్వణ మంత్రములను వేరుచేసి దీనికి 'అధర్వణ వేదమ'ని పేరు పెట్టాడు. అయితే యీ అన్నింటియొక్క మూలాధార తత్త్వాన్ని జగత్తునకు చాటుటకే యీ మాదిరి విభజించాడు.

ఒకొక్క సంహితను తిరిగి మూడు భాగములుగా విభజిస్తూ వచ్చాడు. ఇవియే బ్రాహ్మణములు, ఆరణ్యకములు మరియు ఉపనిషత్తులని. బ్రాహ్మణములనగా మంత్ర స్వరూపములు. మంత్ర స్వభావములు జగత్తునకందించి యిందులో వుండిన యజ్ఞయాగాది క్రతువులకు తగిన మంత్రములు నిరూపిస్తూ వచ్చాడు. ఇందులో ఐతరేయబ్రాహ్మణం, కౌశీతకి బ్రాహ్మణం, శతపథ బ్రాహ్మణం, గోపథబ్రాహ్మణం అని నాలుగు రీతులుగా విభజించాడు. ఇతరేయము కేవలము యజ్ఞ యాగాదిక్రతువులయందు వుచ్చరించే మంత్రస్వరూపము. రెండవ బ్రాహ్మణము గద్య, పద్య సహితమైనది. ఇందులో కర్మభాగము యెక్కువగా వుంటుంది. మానవుడు గృహస్థాశ్రమము త్యజించి వానప్రస్తములో ప్రవేశించి, అరణ్యములో దీనిని అధ్యయనం చేయటంచేత దీనికి ఆరణ్యకమని పేరు వచ్చింది. ఇందులోనే చివరి భాగమునకు గోపథబ్రాహ్మణమని పేరు పెట్టారు. ఇది ధర్మమార్గమును అధికముగా ప్రబోధిస్తూ యజ్ఞయాగాది స్వరూపాన్ని నిరూపిస్తూ వచ్చింది.

మూడవది ఉపనిషత్తు. దీనియందు నిత్యజీవితములో ప్రతిమానవుడు ధర్మార్థకామమోక్షముల నిమిత్తమై ఆచరించ తగిన కొన్ని మార్గములు నియమిస్తూ వచ్చారు. అయితే విద్యావివేకములద్వారానే ఒక ఉపనిషత్తును పొందటానికి సాధ్యమవుతుంది. ఈ విద్యలయందు రెండురకములైన విద్యలు కలవు. ఒకటి పర విద్య. రెండవది అపరవిద్య. వేదములన్నియు కేవలం అపరవిద్యలను మాత్రమే బోధిస్తూ వచ్చాయి. ధర్మార్థకామములను మాత్రమే వివరించాయి. తదుపరి మోక్షమునకు సరైన మార్గము తన స్వప్రయత్నమే అనేది గుర్తించటానికి ప్రయత్నించారు.

**'ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య'**

వేదములు 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః' అని

ఉద్ఘాటించాయి. త్యాగముచేతనే అమృతత్వమనే మోక్షము ప్రాప్తిస్తుందని, త్యాగము లేకుండా యీ విధమైన స్థానము పొందలేరని నిరూపిస్తూవచ్చింది. కనుక, వేదములు పురుషార్థములు మూడింటిని మాత్రమే చక్కగా ప్రబోధిస్తూ వచ్చాయి. నాల్గవదైన మోక్షం దైవానుగ్రహంచేతను, మానవునియొక్క సాధనలచేతను లభ్యమౌతుంది. ఈ జగమునకు ఐహికము, ఆధ్యాత్మికము రెండింటియొక్క తత్త్వము అవసరము. 'ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య' అన్నారు. జీవనోపాధి ఒకటి. జీవిత పరమావధి మరొకటి. జీవనోపాధి నిమిత్తమై యేర్పడిన తత్త్వములనుకూడా ప్రబోధిస్తూ వచ్చాయి, వేదములు. ఇష్టమును నెరవేర్చుకొనుటకు, అయిష్టమును దూరము గావించుకొనుటకు తగిన ఉపాయములు బోధించాయి, వేదములు. వేదాధ్యయనము ప్రాచీనకాలమునుండి గురు శిష్య పరంపరగా అభివృద్ధి గాంచుతూ వచ్చింది.

వేదమునకు తొమ్మిది పేర్లు కలవు. శృతి, అనుశృతి, త్రయి, ఆమ్నాయం, సమామ్నాయం, ఛందస్సు, స్వాధ్యాయం, ఆగమం, నిగమం. వీటి లక్షణాలను గుర్తించటానికి మనం ప్రయత్నించాలి. మొట్టమొదటిది, శృతి. గురువు వుచ్చరించే పదములను శ్రద్ధాభక్తులతో శ్రవణంచేసి వుచ్చరించే స్థితికి 'శృతి' అని పేరు పెట్టారు. అనగా వినికిడిచేత గురువు వుచ్చరించినట్లే తానుకూడను వుచ్చరించి వేదమును అధ్యయనం చేయటంచేత వేదమునకు శృతి, అనుశృతి అని పర్యాయపదములుగా పేర్లు పెట్టారు. ప్రారంభములో వేదము అనంతమై ఒక్కటిగానే వుండేది. తదుపరి మూడుగా విభజిస్తూవచ్చారు. అవే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము. ఈ మూడూ జగత్తులో వ్యాపిస్తూ వచ్చాయి. కనుకనే 'త్రయి' అని మూడు వేదములయొక్క స్వరూపమనే రీతిగా సరైన పేరు వచ్చింది. 'మ్న' అనే ధాతువుకు 'అభ్యాసము' అని ఒక అర్థము. ఆమ్నాయమనగా అభ్యాసముచేత అధ్యయనం చేయడం. అందువలన దీనికి 'ఆమ్నాయమ'ని పేరు వచ్చింది. సామవేదము ఛందోబద్ధమైనందున దీనికి 'ఛందస్సు' అని పేరు వచ్చింది. ఇది పరంపరగా అనగా తండ్రీ బిడ్డల పరంపర, వంశపారంపర్యంగా దీనిని అధ్యయనము చేసుకుంటూ రావటంచేత అధ్యాయమని పేరు వచ్చింది. ఇక, ఆగమ, నిగమములనేవి భగవంతుని వుచ్ఛ్వాసనిశ్వాసములుగా వుండుటచేత వేదమునకు

sri sathyasai vachanamrutam

ఆగమనిగమములని మరో పేరు వచ్చింది.

**వేదార్థమును తెలిసి పారాయణచేసినవారి జీవితం సార్థకమవుతుంది**

దేశకాలపరిస్థితుల ప్రభావముననుసరించి, యీయొక్క అధ్యయనము ననుసరించి దాని మర్మములను సక్రమమైన మార్గములో అనుసరించటంచేత వేదములకు యీ విధమైన పేర్లు లభిస్తూ వచ్చాయి. ఇట్టి పవిత్రమైన వేదములు అనాది కాలమునుండి భారతదేశమును సంరక్షిస్తూ వస్తున్నాయి. వేదములు కేవలం పారాయణము చేయవలసినటువంటి గ్రంథములు మాత్రమేకాదు. అర్థమును గుర్తించి, ఆచరించి, అనుష్ఠానమునందించి ఆనందించవలసినది వేదము. అప్పుడే అధ్యయనము చేసిన వానికి తగిన ఆనందం లభ్యం కావచ్చు. కాలమును పవిత్రము చేసినవాడు కావచ్చు. అర్థము తెలిసి పారాయణచేసినవాని జీవితం సార్థకమవుతుంది. కానీ, దురదృష్టవశాత్తు యీనాడు భారతదేశంలో యీ పవిత్రమైన, దైవస్వరూపమైన వేదములకు అర్థము తెల్సినటువంటి వ్యక్తులు కరువై పోయారు.

వేదములందుండే శబ్దములకు అనేక అర్థములుంటున్నాయి. అయితే, యెవరికి తగిన అర్థములు వారు స్వీకరించి వారి వారి అనుగుణ్యంగా దీనిని బోధిస్తూ వస్తున్నారు. అందుకోసమే నారదుడు ఒక పర్యాయము వేదార్థములను బోధింపుడని సనత్కుమారుని ప్రార్థించినప్పుడు ఆయన "నాయనా! భయంకరమైన అరణ్యము, యీ వేదశాస్త్రములు. ఇందు దారి తప్పి నడచిన చాలా ప్రమాదము సంభవిస్తుంది. వేదమంత్రములకు అనేక అర్థములుంటున్నవి. ఒకొక్క శబ్దమునకు అనేక అర్థములు వుంటున్నవి. నీవు యెట్టి అర్థమును స్వీకరింతువో! కనుక, యిది చాలా దుర్లభమైనది, చాలా కష్టమైనది. ఈ విధమైన బాధలకు నీవు గురికాక భగవత్ భక్తిని అభివృద్ధి గావించుకొని అందులోనే తన్మయాత్ముడవై, ఉన్మత్తుడవై, ముక్తిని పొందమ"ని బోధించాడు. అప్పుడే నారదుడు భక్తిసూత్రములను ప్రారంభించాడు. వీటికే 'నారదభక్తిసూత్రము'లని పేరు వచ్చింది. సనత్కుమారుని ప్రబోధలచేత నారదుడు నూతనమైన భావమును గ్రహించాడు.

**భగవద్భావములను వర్ణించడం దుర్లభమైన కార్యము**

sri sathyasai vachanamrutam

పురుషార్థములు నాలుగే! కాని, దైవప్రేమ అనేది తాను ఐదవదిగా బోధిస్తూ వచ్చాడు. ధర్మార్థకామమోక్షములేకాక 'పరమ ప్రేమ' అనేది ఐదవ పురుషార్థముగా మోక్షముకంటే అధికమైనదిగా తాను విశ్వసిస్తూవచ్చాడు. మోక్షమనగా కేవలము మోహమును క్షయము గావించుకోటం. ఇంతమాత్రంచేత మోక్షమనేదానిలో ఆనందం మనకు కనుపించదు. నిరంతరం భగవంతునితోనేకూడి, ఆడి, పాడి ఆనందంగా తాదాత్మ్యభావాన్ని పొందటమే పరమ ప్రీతిగా భావిస్తూ వచ్చాడు, నారదుడు. ఈ పరమ ప్రేమకూడను వేదసారముగానే తాను భావిస్తూ వచ్చాడు. కనుక, వేదములయొక్క విషయము చెప్పటంగాని, అధ్యయనం చేయుట గానీ చాల కష్టము. భగవత్ భావములను వర్ణించటం అనేది చాలా దుర్లభము. కనుకనే యీ వేదాధ్యయనం క్రమక్రమేణా సన్నగిల్లిపోవటం ప్రారంభమైంది. ఆ కారణంచేతనే వేదముయొక్క అసలు స్వరూపమును మనం కాపాడుకొనలేకపోతున్నాము.

ప్రాచీనకాలములో వేదమునకు అనేక శాఖలు వుండేవి. ఋగ్వేదమునకు ప్రధానమైన శాఖలు 21. ఇంక వుపశాఖలు అనేకంగా వుంటున్నాయి. కానీ యీనాడు భారతదేశములో చూస్తే యీ ఋగ్వేదములో రెండు శాఖలు మాత్రమే మిగిలి వుంటున్నాయి. 19 శాఖలు యెక్కడా కన్పించటంలేదు. కాలగర్భములో కలిసిపోయాయి. యజుర్వేదములో ప్రధానమైన శాఖలు 86 వుండేవి. ఈనాడు 4 శాఖలు మాత్రమే వుంటున్నాయి. సామవేదంలో 1000 శాఖలుండేవి, ప్రధానమైనవి. కానీ సామవేదములోకూడను యీనాడు మూడు మాత్రమే నిలచివున్నవి. అదే విధముగా అథర్వణవేదములోకూడను 9 ప్రధానమైన శాఖలుండేవి. కానీ రెండు మాత్రమే నిలచినవి.

**వేదములు జగత్తునకు ప్రాణాధారములు**

ఈ విధముగా అల్ప సంఖ్యలో వున్న వేదవిభాగములే అనంతమైన అర్థాన్ని బోధిస్తుండగా యింక అనంతమైన వేదములయొక్క అన్ని శాఖలు వుండివుంటే యెంత పవిత్రమైన అర్థములు బోధించివుండేవో! యీనాడు వుండిన రెండు, మూడు, నాల్గు శాఖలుకూడను యింక యెంతకాలము మనము నిల్పుకుంటామో అనేదికూడా సందేహాస్పదమే! ఈనాడు వేదాధ్యయనము చేసే వ్యక్తులు చాలా అరుదైపోయినారు. అసలు

sri sathyasai vacharamrutam

వేదాధ్యయనంకూడను ఒక వ్యాపారముగా తయారైనది. కనుకనే క్రమక్రమేణా వున్నశాఖలుకూడను కోల్పోవలసివస్తోంది. వేదములు జగత్తునకు ప్రాణములు అనే సత్యాన్ని వీరు విస్మరిస్తూ పోతున్నారు. సమస్త వేదములకు మాతయైన గాయత్రి తత్వాన్ని విస్మరిస్తూ వస్తున్నారు. గాయత్రిని ఛంధసోమాతః అన్నారు. అనగా ఛందస్సునకంతా తల్లివంటిది.

**ఈనాడు వేదాధ్యయనము వంశపాపంపర్యంగా అభివృద్ధి చెందటం లేదు**

ఈనాడు వేదాధ్యయనము గావించిన వ్యక్తులు తాము తమ సంతతికికాని, తోటి మానవులకుకాని వాటిని బోధించటానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ విధముగా వంశపారంపర్యంగా వస్తున్న వేదములు యీనాడు వ్యాప్తి కాకుండా నిలచిపోటంచేతనే వేదము క్షీణిస్తూవస్తున్నది. ఒక చిన్న ఉదాహరణము. ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రిగారని ఒక పరమభక్తుడు. అతడు సాక్షాత్తూ వేదపురుషుడనే చెప్పవచ్చును. వేదార్థములనేవి అతనికి త్రాగునీరువలె సులభముగా వుండేవి. ఆయన వాటిని గుర్తించేవాడు, వాని ప్రకారమే వర్తించేవాడు. కానీ, అతను గతించిన తక్షణమే యీ వేదమంతా అంతర్ధానమైపోయింది. తన యింటిలో వేదము వుచ్చరించే వ్యక్తే లేకపోయినాడు. తన సంతతి అంతయు ఆంగ్ల విద్యా దాసత్వము పొందటంచేత యీ వేదమును క్రమక్రమేణా మరచిపోతూ వస్తున్నారు. ఈ విధముగా భారతదేశములో ఈనాడు ధనార్జనే ప్రధానమైన లక్ష్యముగా వుంచుకోటంచేత యీ పవిత్రమైన వేదధనాన్ని మనము కోల్పోతున్నాము. తాను యెంత గొప్ప వేదపండితులైనప్పటికిని తనకుమారులలో ఒక్కరైనను వేదము నభ్యసించినవారు లేరు. చివరకు తన మనుమలు తెలుగుభాషకూడా రానటువంటివారుగా వుంటున్నారు. అదే విధముగ వేదములు గంటవలె మ్రోగుతూవుంటాయి, కామావధాని నోటిలో! వేదాన్ని అభ్యసించి, అధ్యయనం చేసిన కామావధాని యింటిలో ఒక్క కుమారుడైనా వేదాన్ని పఠించేవాడు లేదు. ఈ విధముగా వేదమును తమ పుత్రులకే తాము బోధించకుండా వుండటంచేత పబ్లిక్‌లోపల ఒక విధమైన అవిశ్వాసము బయలుదేరుతూ వచ్చింది. 'వేదమే అంత మహత్తరమైనట్లైతే తమ పుత్రులకు తాము యెందుకు



srisathyasaivachanamrutam

బోధించకూడదు? కనుక దీనియందు యే విధమైన మహత్యము లేద'ని ఒక అలసత్వ భావము ప్రపంచములో ఈనాడు అభివృద్ధి గాంచుతూ వస్తున్నది. యిట్టి అపోహలను ఖండించి 'వేదము మహత్తరమైనది, వేదమే సర్వము, వేదమే పరమాత్మస్వరూపము' అనే సత్యాన్ని మనము చాటుతూ రావాలి.

**వైదిక కర్మలు ఆచరించినప్పుడే వేదనలు దూరమై ఆనందము ననుభవించగలరు**

భారతీయులయొక్క ప్రతికర్మ వేదములకు సంబంధించినదే! వేదసంబంధమైన కర్మలు ఆచరించినప్పుడే వారిలో వున్న వేదనదూరమై ఆనందమును అనుభవించగలము. వేదాన్ని గుర్తించి వర్ణిస్తూ బోధిస్తూ దాని ఘనతను, దాని మహిమను అనేక రీతులుగా చాటుతున్నవారికే వేదమునందు విశ్వాసము లేకపోతున్నది. వైదిక కర్మలు చిత్తశుద్ధి గావించుకొనే నిమిత్తమై యేర్పడిన పవిత్రమైన కృత్యములుగా మనము విశ్వసించాలి.

**వేదవేదాంగములు వల్లెవేసియున్న**
**పద్యగద్యములుకూడ పలికియున్న**
**అంతశ్శుద్ధియే లేకున్న చెడునువాడు**

యీ విధముగా అంతశ్శుద్ధిలేకుండా యెన్ని వేదములు వల్లిస్తే లాభమేమిటి? వేదములు పవిత్రమైనప్పటికి కేవలం వాటి పేరు వుచ్చరించటంచేత మనకు సంప్రాప్తి కలుగదు. పంచభక్ష్యపరమాన్నములైనప్పటికి తట్టయందు వుంచుకొని పంచభక్ష్యపరమాన్నమని స్మరించినంతమాత్రమున మన పొట్ట నిండదు. ఎంత విలువైన ఔషధములైనా మనము వల్లించుకుంటూ కూర్చున్నంత మాత్రమున మన రోగము నివారణకాదు. ఎంతో ప్రకాశవంతమైన జ్యోతినికూడా కేవలం మనము చింతించుకుంటూ కూర్చున్న అంధకారం మనకు దూరం కాదు. మనం అంతో యింతో ఆచరణలో పెట్టి, అనుభవించి, ఆనందించి అన్యులకు అందించాలి. ఇంకా యితర దేశాలకు అందించటానికి ప్రయత్నించాలి.

మరొకవిషయము, వేదమును కొందరి సొత్తుగా భావించి యితరులు దానిని వల్లించటానికి అధికారములేదని చెప్పి ప్రచారం చేయటంచేత వేదముయొక్క ప్రాచుర్యము క్రమక్రమేణా తగ్గిపోతున్నది. కనుక, వేదమనే దానిని వుచ్చరించక పోయినప్పటికి



sri sathyasai vachanamrutam

వేదముయొక్క అంతరార్థమును, వేదముయొక్క విశిష్టతను ప్రపంచమునకు చాటటానికి ప్రతి విప్రుడుకూడను సంసిద్ధముగా వుంటుండాలి

**తాను చెప్ప తలపు పుట్టదు కాని**
**ఒరులు చెప్పుట చూచి ఓర్వలేరు**

తాము చెప్పరు, ఒరులను చెప్పనివ్వరు. ఇంక స్వాధ్యాయము చూస్తామా అంటే అనేక రకములైన వ్యాఖ్యానములు చేస్తారు. ఇది సరైన మార్గముకాదు.

**వేదము సత్యస్వరూపమైనది**

సత్యస్వరూపమైనది వేదము. వేదమే లేకపోతే ధర్మము యెక్కడనుండి వస్తుంది. 'సత్యాన్నాస్తి పరోధర్మః'. ధర్మమనేది సత్యముపైన ఆధారపడి వుంటుంది. నిత్యసత్యనిర్మలమైనది యీ వేదము

**అన్ని జీవులయందున్న ఆత్మ నేను**
**ఒక్కటేయని మది యెరుగరయ్య**

అనగా 'అందరియందువున్న ఆత్మ, నేను ఒక్కటే. నేను అనేదే ఆత్మ. ఆత్మ, నేను రెండు ఒక్కటే' అనే సత్యాన్ని గుర్తించాలి. ఆత్మకు ఒక్కదానికి మాత్రమే నేను, నేను అని చెప్పటానికి అధికారముంటున్నాది. అది అనంతమైనది. ఇలాంటి వేదమును యీనాడు యేదో ఒక సంకుచితమైన భావముతో వుపయోగపెట్టుకుంటున్నాము. ఈ సంకుచితమైన భావాన్ని మనము ప్రక్కకునెట్టాలి. విశాలమైన భావములు మనము పెంచుకోవాలి.

**నిత్యజీవితములో ఆచరించే సర్వకర్మలు వేదమునుండి ఆవిర్భవించినవే!**

ఈ విశాలమైన జగత్తులోపల వివేకవంతమైన యీ వేదమును మనము వ్యాప్తి గావించాలి. ప్రతి మానవుడు వేదమును గౌరవించాలి. నీయొక్క జీవితానికి ఆధారమే వేదము. నీ నిత్యజీవితములో చేసే సర్వకర్మలు వేదమునుండి ఆవిర్భవించినవే! మీకు తెలిసినా, తెలియకపోయినా సర్వము వేదమయమే! ఆ వేదమయుడైన నారాయణుడే యజ్ఞమునందు సాక్షాత్కరిస్తున్నాడు. కనుకనే నారాయణుడు యజ్ఞస్వరూపుడు.

sri sathyasaivacharamrutam

యజ్ఞమనగా త్యాగమే! దేనిని త్యాగము చెయ్యాలి? దుర్గుణములు త్యాగము చెయ్యాలి. అహంకారమును త్యాగము చెయ్యాలి. దుశ్చింతలు త్యాగము చెయ్యాలి. దుర్మార్గమును త్యాగము చెయ్యాలి. అప్పుడే దైవత్వమనేది మనకు సాక్షాత్కారిస్తుంది

**ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్పవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు**
**కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున**
**తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!**

మనము అనేక విధములైన భావములచేత హృదయాన్ని నింపుకున్నాము. ఇక వేదసారమనే భావాన్ని నింపుకోవాలంటే స్థానములేదు. కనుక, యీ దుర్భావములను మనము దూరము చేసి, హృదయమును ఖాళీ చేసి దానితో యీ వేదసారమనే దైవత్వాన్ని నింపుకోవాలి. ఇదియే దైవము అవతరించటానికి దుష్టశిక్షణ, శిష్టరక్షణ. అనగా దుర్మార్గులను చంపటముకాదు. దుర్మార్గమనగా మన భావములే! మన తలంపులే! వీటిని చంపాలి. కనుకనే సద్భావములు పోషించి, దుర్భావములు దూరము చేసి సరియైన జీవతత్వాన్ని మానవత్వముగా వికసింప చేయటమే వేదముయొక్క విశిష్టత.

**వేదములందు విదేశీయులకు ఉండిన విశ్వాసము భారతీయులకు లేకపోతున్నది**

వేదశాస్త్రములు నియమించిన మార్గములో మనము నడచుకొన్నప్పుడు దానిని మనస్సు రీతిగా ప్రమాణపూర్వకముగా ఆచరించినప్పుడు, మానవునకు బాధలేవుండవు. కానీ యీ బాధలకంతా మూలకారణము దానిని విస్మరించటము. భూమికి ఆకర్షణ శక్తి ఆనాటినుండి వుంటున్నాది. కాని న్యూటన్ అనేవాడు అనేక పరిశీలనలు చేసి, పరిశోధనలు చేసి భూమికి ఆకర్షణ శక్తి వున్నదని గుర్తించాడు. అంతకు పూర్వముకూడను యీ ఆకర్షణశక్తి భూమికి లేకపోలేదు. అదే రీతిగా భారతదేశమందు భారతీయులు యీ వేదప్రమాణాన్ని, వేద మహత్యమును తమ పరిశోధనలద్వారా పరిశీలన చేశారు. భారతీయులు పరిశోధించి, పరిశీలన చేయటమువలన యీ వేదము ప్రపంచమంతా వ్యాప్తి చెందినదని చెప్పటానికి వీలుకాదు. ప్రపంచమంతా నిండి నిబిడీకృతమైవున్నది, వేదము. ఇతర దేశములలో ఈ

sri sathyasai vachanamrutam

విధమైన పేర్లు లేకపోవచ్చును. అదే రీతిగా న్యూటన్ యే దేశమువాడో భూమికి ఆకర్షణశక్తి వున్నదన్నప్పుడు భారతీయులు దీనిని లేదని చెప్పటానికి వీలులేదే! అట్లే భారతీయులు పరిశోధించిపెట్టిన యీ వేదమును యితరులు లేదని చెప్పటానికిలేదు. ఇతర దేశస్థులుకూడను యీ వేదమును యెంతగానో గౌరవిస్తున్నారు. మేక్స్ ముల్లర్ అనేవాడు యీ వేదమునకు అనేక వ్యాఖ్యానములు వ్రాసి దీని పుట్టు పూర్వోత్తరములు యెక్కడని అనేక విధములుగా పరిశీలన చేశాడు. రాత్రింబవలు అనేక విధములుగా అభ్యసిస్తూవచ్చాడు. తన జీవితమంతా వేదమునకే ధారపోశాడు. కనుకనే 'మేక్స్ ముల్లర్' అనే పేరు పోయి 'మోక్ష ముల్లర్' అనే పేరు వచ్చింది. వేదములందు విదేశీయులకు వుండిన విశ్వాసము భారతీయులకు లేకపోతున్నాది. ఇదే యీనాడు ప్రవేశించిన దురదృష్టము. ఈ దురదృష్టము యేనాడు భారతదేశములో ప్రవేశించిందో ఆనాటినుంచే నిత్యకళ్యాణము, పచ్చతోరణముతో కళకళలాడుతున్న భారతదేశము, అన్నపూర్ణస్వరూపమైన భారతదేశము, 'అన్నమో రామచంద్రా' అని అల్లాడవలసి వచ్చింది.

**దేశక్షేమము, లోకకళ్యాణము వేదముపైననే ఆధారపడి ఉంటున్నవి**

ప్రేమస్వరూపులారా! ప్రతి వ్యక్తికూడను యీ వేదాన్ని సరైన రీతిలో పోషించటానికి కంకణం కట్టుకోవాలి. దేశక్షేమము, లోకకళ్యాణము వేదముపైననే ఆధారపడి వుంటున్నది. 'ఎంత మాత్రము యెవ్వరు తలచిన అంతమాత్రమే తాను' అన్నారు. భగవంతుడు కలడనే విశ్వాసముకలవారికి కలడు. లేడనేవారికి లేడు. కలడు, లేడనేది మన కంఠానికేగాని, దైవానికి కాదు. వేదము క్రమక్రమేణా క్షీణించిపోవడానికి బ్రాహ్మణులే కారణము. ఎన్నైనా చెప్పవచ్చును. కానీ చేసి చూపించాలి. కనుక, అందరు కంకణంకట్టి దీని అభివృద్ధిని పోషించటానికి తగిన కృషి చేయాలి. ఇంకా ఒక పది సంవత్సరములో, ఇరువది సంవత్సరములో జరిగితే వారుకూడను దీనిని నిలపటానికి సాధ్యంకాదు. ఇప్పుడే యీ వేదములకు కొంత అంటుకట్టినట్లుగా వేదాధ్యయనమునకు ప్రచార, ప్రబోధలు గావించి సరైన ఉత్సాహప్రోత్సాహములందించాలి.

**చెప్పవచ్చు కోటి చెయ్యరు ఒకటి**

sri sathyasaivechanamrutam

### చెప్పుట సులభంబు చేయుటకష్టంబు

ఇలాంటి పరిస్థితిలో వున్నప్పుడు యీ వేదము మహత్తరమని యెంత చెప్పి యేమి ప్రయోజనము? వేదము సర్వస్వతంత్రమైనది. ఇది భగవంతునికి, నీకు సన్నిహితసంబంధబాంధవ్యాన్ని అభివృద్ధిగావించేది. వేదము తెలిసిన వ్యక్తులందరు కొంతవరకు త్యాగముగావించి, తమ జీవితాన్ని వేదానికి అర్పితముగావించాలి. అప్పుడే భారతదేశముయొక్క ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరింపచేసినవారమవుతాము. వేదహితమైన కర్మలను విసర్జిస్తున్నారు. 'ముట్టకు, ముట్టకు' అనే మూఢాచారంలో మునిగిపోతున్నారు. వేదము చెప్పినది యేమాత్రం అనుసరిస్తున్నారు? ప్రాణము పోయిననూ సరే, వేదము ననుసరించాలి. అలాంటి కంకణం కట్టుకున్నప్పుడే యీ వేదాన్ని మనము ప్రచారము చేయటానికి అర్హులమవుతాము. కేవలం కొన్ని మంత్రాలు వల్లెవేసినంత మాత్రమున అభివృద్ధి కాదు. దీనిని నిర్భయముగా, నిస్సందేహముగా ప్రచారం సల్పటానికి పూనుకోవాలి.

సత్యానికి భయమెందుకు? అసత్యానికే భయము. వారిలో అసత్యము వుండటంచేతనే భయపడుతున్నారు. భయము ఎందుకు? ప్రాణం తీస్తారా, తీయనీ! వేదాలకోసం నీ ప్రాణాన్ని అర్పితం చేశావనేది, అదికూడను గొప్పఘనతగానే వుంటుంది. ఈ విధమైన దృఢవిశ్వాసముచేత వేదాన్ని పునరుద్ధరింపచేయటానికి ప్రయత్నం చేయాలి. వేదము బోధించిన దానిని ఆచరణలో పెడుతూ రావాలి. ఆచరణలో పెట్టినదానిని అన్యుల కందించాలి. అప్పుడే యిది క్రమక్రమేణా పెరుగుతూ వస్తుంది. ఈ విధమైన మార్గాన్ని ప్రతివ్యక్తికూడను బాధ్యతగా భావించి దీనిని పునరుద్ధరింపచేయటానికి ప్రయత్నం చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 28-09-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam